క్లుప్తంగా

వైఎస్సార్‌ సీపీ విజయానికి సైనికుల్లా కృషి చేయాలి

ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే)

మంగళగిరి: రానున్న 2024 అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్సార్‌ సీపీ విజయానికి ప్రతి ఒక్కరూ సైనికుల్లా కృషి చేయాలని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) అన్నారు. మంగళవారం నగరంలోని తన కార్యాలయంలో ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావుతో కలసి మంగళగిరి అర్బన్‌, రూరల్‌ బూత్‌ లెవల్‌ అసిస్టెంట్లు (బీఎల్‌ఏ)లతో సమావేశం నిర్వహించారు. 2024 సార్వత్రిక ఎన్నికలు ప్రత్యేకమైనవని, పేదలకు, పెత్తందారులకు మధ్య జరుగుతున్న యుద్ధంగా అభివర్ణించారు. పేద వర్గాల ప్రజల గుండెల్లో సుస్థిర స్థానం ఏర్పాటు చేసుకున్న ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి తరపున అందరం సైనికుల్లా పోరాడాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. గడచిన ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా అంతిమ విజయం ప్రజాస్వామ్యానిదే అని నిరూపితమైందని గుర్తు చేశారు. రేపటి ఎన్నికల్లో కూడా మనమందరం పెత్తందారీ పార్టీల కుట్రలను ప్రజాస్వామ్య రీతిలో తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. స్థానికేతరుల ఓట్లు, డబుల్‌ ఎంట్రీ ఓట్లు గుర్తించి సంబంధిత బీఎల్‌ఓ దృష్టికి తీసుకువెళ్లి వాటిని తొలగింపు చేయడంలో అలసత్వం వహించకూడదని కోరారు. సమావేశంలో జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, పట్టణ, రూరల్‌ జేసీఎస్‌ కన్వీనర్‌లు ఎండీ ఫిరోజ్‌, అన్నపురెడ్డి బ్రహ్మారెడ్డి, మహిళా నాయకులు మల్లవరపు సుధారాణి, సంకె సునీత, కలకోటి స్వరూపరాణి, గోలి కస్తూరి తదితరులు పాల్గొన్నారు.

బూత్‌ లెవల్‌ ఏజంట్లను నియమించాలి



ఫిరంగిపురం: మండలంలోని అన్ని గ్రామాల్లో బూత్‌ లెవల్‌ ఏజంట్లను నియమించుకోవాలని నియోజకవర్గ ఎలక్టోరల్‌ రిజిస్ట్రేషన్‌ అధికారి ఎం.వెంకట్రామిరెడ్డి అన్నారు. స్థానిక తహసీల్దార్‌ కార్యాలయంలో మంగళవారం రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇప్పటికే ప్రతి గ్రామంలో బీఎల్‌వోలు ఇంటింటికి తిరిగి ఓట్లు ఉన్న వారి వివరాలు, నమోదు చేసుకోవాల్సిన వారికి ఫారాలు అందజేస్తున్నట్లు తెలిపారు. ఒకే ఇంటిలో పది కన్నా ఎక్కువ ఉన్న వారి వివరాలు తెలుసుకొని కారణాలు నమోదు చేస్తున్నట్టు వివరించారు. తహసీల్దార్‌ పద్మనాభుడు, ఈవోపీఆర్డీ నిర్మలలక్ష్మీకుమారి, పలు శాఖల అధికారులు సుభాని, నిర్మల, శ్రీనివాసరావు, పి.జోజప్ప, రాజకీయపార్టీల నాయకులు చిట్టా అంజిరెడ్డి, కొమ్మారెడ్డి చిన్నపురెడ్డి, పి.జేమ్సు్ఇన్నయ్య, ఎం.సుధాకరరెడ్డి, అప్పిరెడ్డి, ఎం.నరసింహారావు, జి.చంద్రశేఖర్‌, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనులు ప్రారంభం

తాడేపల్లిరూరల్‌: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని పెనుమాక కృష్ణాయపాలెం రహదారి విస్తరణ పనులను నగరపాలక సంస్థ అధికారులు మంగళవారం నుంచి చేపట్టారు. ఉండవల్లి నుంచి పెనుమాక మీదుగా కృష్ణాయపాలెం వెళ్లేందుకు ప్రత్యామ్నాయంగా పెనుమాక శివారు నుంచి హిందూ బరియల్‌ గ్రౌండ్‌ మీదుగా రావిచెట్టు సెంటర్‌ వరకు మరో రహదారిని నిర్మించేందుకు గతంలో అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. కార్పొరేషన్‌ నుంచి రూ. కోటి కేటాయించి సుమారు 800 మీటర్ల పొడవున బీటీ రోడ్‌ నిర్మించనున్నారు. మార్గం మధ్యలో కొన్నిచోట్ల రోడ్డు ఆక్రమణలకు గురికావడంతో వాటిని తొలగించి పనులు చేపట్టినట్లు డీఈ కృష్ణారెడ్డి తెలిపారు. కృష్ణాయపాలెం మీదుగా అమరావతి వెళ్లేవారు ఈ మార్గంలో వెళ్లవచ్చని దానివల్ల పెనుమాక ప్రాంతంలోని వైఎస్సార్‌సెంటర్‌, బొడ్డురాయి సెంటర్‌లతో పాటు పలు ప్రాంతాల్లో ట్రాఫిక్‌ తగ్గుతుందని తెలిపారు.

బోరు పంపునకు మరమ్మతులు

తాడేపల్లిరూరల్‌: తాడేపల్లి పట్టణ పరిధిలోని ప్రకాష్‌నగర్‌లో బోరు పంపునకు మంగళవారం మరమ్మతులు నిర్వహించారు. పంపు మరమ్మతులకు గురై తాగునీరు రావడంలేదని ఎమ్మెల్యే కార్యాలయానికి స్థానికులు వాట్సాప్‌ ద్వారా సమాచారం అందించారు. ఎమ్మెల్యే కార్యాలయం నుంచి నగర పాలక సంస్థ ఇంజినీరింగ్‌ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. గంట వ్యవధిలో ప్రకాష్‌నగర్‌లోని బోరు పంపునకు మరమ్మతులు నిర్వహించారు.

అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తిచేయాలి

ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే)



నేతన్న సర్కిల్‌ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు

మంగళగిరి: నగరంలో కోట్లాది రూపాయల వ్యయంతో చేపట్టిన పలు అభివృద్ధి నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేసి ప్రారంభోత్సవాలకు సిద్ధం చేయాలని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) అన్నారు. ఆయన ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావుతో కలసి నగరంలో తుదిదశకు చేరుకున్న పలు అభివృద్ధి పనులను మంగళవారం పరిశీలించి నగరపాలక సంస్థ అధికారులకు, కాంట్రాక్టర్లకు పలు సూచనలు చేశారు. తొలుత ఆత్మకూరు జగనన్న కాలనీని సందర్శించి స్థానిక ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు గ్రావెల్‌ రోడ్లకు గుంతలు ఏర్పడి స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతుండటంతో రెండు రోజుల నుంచి కార్పొరేషన్‌ అధికారులు చేపట్టిన మరమ్మతు పనులను పరిశీలించారు. ఇప్పటం రోడ్డు నుంచి జగనన్న కాలనీకి వెళ్లే మార్గంలో విద్యుత్‌స్తంభాలు ఏర్పాటు చేసి వీధిలైట్లు బిగించాలని స్థానిక ప్రజలు ఎమ్మెల్యే ఆర్కేను కోరగా వెంటనే విద్యుత్‌ స్తంభాలు ఏర్పాటు చేసి వీధిలైట్లు బిగించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా తమకు రెండు సెంట్ల స్థలాన్ని ఇచ్చి కట్టుకునేందుకు ఆర్థిక సహాయం కూడా అందజేసినందుకు లబ్ధిదారులు సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి, ఎమ్మెల్యే ఆర్కేకు ధన్యవాదాలు తెలిపారు.

ముక్కోటి నాటికి పెద కోనేరు పనులు పూర్తి

నగరంలో వేంచేసియున్న లక్ష్మీ నృసింహస్వామి దేవస్థానానికి చెందిన కల్యాణ పుష్కరిణి (పెద కోనేరు) పనులు ముక్కోటి ఏకాదశి నాటికి పూర్తి చేయాలని ఎమ్మెల్యే ఆర్కే అధికారులకు సూచించారు. నగరంలోని లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఆవరణలోని ఈఓ కార్యాలయంలో మంగళవారం ఆయన కల్యాణ పుష్కరిణి పునరుద్ధరణ పనుల గురించి దేవాదాయ శాఖ ఇంజినీరింగ్‌ విభాగ అధికారులు, దేవస్థాన అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఇప్పటికే పెద కోనేరు పూడికతీత పనులు పూర్తి అయ్యాయని, తదుపరి పునఃనిర్మాణ పనుల గురించి దేవాదాయ ఇంజినీరింగ్‌ అధికారులతో చర్చించినట్లు తెలిపారు. చారిత్రాత్మక కట్టడం పెద కోనేరును భవిష్యత్తు తరాలకు అందించాలనే లక్ష్యంలో భాగంగా తీసుకోవాల్సిన రక్షణ చర్యల గురించి చర్చించినట్లు తెలిపారు. త్వరితగతిన అధికారులు పనులకు సంబంధించిన అంచనాలు సిద్ధం చేసి ఉన్నతాధికారుల అనుమతితో పనులు ప్రారంభమయ్యేలా చూడాలని కోరారు.

నేతన్న సర్కిల్‌ నిర్మాణ పనుల పరిశీలన

కార్పొరేషన్‌ పరిధిలోని చినకాకాని వై జంక్షన్‌లో ఏర్పాటు చేయనున్న నేతన్న సర్కిల్‌ నిర్మాణ పనులను మంగళవారం ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావులు పరిశీలించారు. మంగళగిరి నగర ముఖద్వారంలో ఏర్పాటు చేయనున్న నేతన్న సర్కిల్‌ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఆగస్టు 15వ తేదీ 100 అడుగుల భారీ జాతీయ జెండాను ఆవిష్కరించనున్న నేపథ్యంలో దానికి సంబంధిన నిర్మాణ పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. డీఈ కృష్ణారెడ్డి, ఏఈ కిషోర్‌, దేవస్థాన ఈవో అన్నపురెడ్డి రామకోటిరెడ్డి, వైఎస్సార్‌ సీపీ నాయకులు బుర్రముక్కు వేణుగోపాలస్వామి రెడ్డి, మున్నంగి వివేకానంద రెడ్డి, మేకా వెంకట్రామిరెడ్డి, బేతపూడి నర్సయ్య, కిషోర్‌ తదితరులు పాల్గొన్నారు.

బీటీ రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన

వడ్లపూడి సెంటర్‌ వద్ద నూతనంగా చేపట్టిన బీటీ రోడ్డు నిర్మాణ పనులను మంగళవారం ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావులు పరిశీలించారు. నగర పరిధిలో ఇప్పటికే పలు బీటీ రహదారుల నిర్మాణాలను పూర్తి చేయడం జరిగిందని, వడ్లపూడి సెంటర్‌లో డివైడర్‌కు ఇరువైపులా సుమారు రూ.1.40 కోట్లతో రోడ్డు నిర్మాణం జరుగుతున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే ఆర్కేను పలువురు స్థానికులు కలసి నూతన రోడ్డు నిర్మాణం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు.



నులకపేటలో సీసీ రోడ్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆర్కే

తాడేపల్లిరూరల్‌: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని పలు ప్రాంతాల్లో మంగళవారం ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) విస్తృతంగా పర్యటించారు. పలు ప్రాంతాల్లో ఉన్న సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. దుగ్గిరాల మండలం రేవేంద్రపాడు నుంచి కుంచనపల్లి వరకు బకింగ్‌హామ్‌ కెనాల్‌ ఒడ్డున నిర్మిస్తున్న 30 అడుగుల బీటీ రోడ్‌ పనులను పరిశీలంచి, నాణ్యత లోపాలు ఉండకూడదని, గడువు లోపు పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం తాడేపల్లి పట్టణ పరిధిలోని మహానాడు, సుందరయ్యనగర్‌, సీతానగరం, కొత్తూరు, నులకపేట, బ్రహ్మానందపురం, ప్రకాష్‌నగర్‌ తదితర ప్రాంతాల్లో కార్పొరేషన్‌ ప్రత్యేక నిధులతో చేపట్టిన పనులను ఆయన పరిశీలించారు. ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యలపైన కార్యాలయానికి ఎవరైనా రాతపూర్వకంగా గానీ, వాట్సాప్‌ ద్వారా సమాచారం ఇస్తే పరిశీలించి వెంటనే చేయిస్తున్నామని, తాడేపల్లి ప్రాంతంలో ప్రజలు వారి సమస్యలను వివరించడంతో ఈ పనులు చేస్తున్నామని, ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించి రూ.130 కోట్లు కేటాయించారన్నారు. ఆ నిధులతో కార్పొరేషన్‌ పరిధిలోని వేర్వేరు ప్రాంతాలను కలుపుతూ బీటీ రోడ్లు నిర్మించడంతోపాటు గతంలో ఎన్నడూ తట్టమట్టి కూడా వేయని రోడ్లలో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు, కల్వర్టు నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని అన్నారు. గతంలో తాడేపల్లి ప్రాంతంలో మురుగునీటి సమస్య అధికంగా ఉండేదని, 70శాతం ఆ సమస్యను పరిష్కరించామని, మరో 30 శాతం కూడా త్వరలోనే పరిష్కరిస్తామని తెలిపారు. తాడేపల్లి ప్రధాన రహదారిలో కొత్తగా తాగునీటి పైపులైన్లు వేసేందుకు సిమెంట్‌ రోడ్డును కొంతభాగం తొలగించారని, వాటి మరమ్మతులు కూడా మరో వారం రోజుల్లో ప్రారంభమవుతాయని తెలిపారు. ప్రజలు ఎటువంటి సమస్యలు ఉన్నా ముందుగా సంబంధిత సచివాలయంలో సమాచారం ఇవ్వాలని, వారు పరిష్కరించపోతే మంగళగిరి తమ కార్యాలయంలో రాతపూర్వంగా అందజేసినా, వాట్సప్‌ ద్వారా సమస్యను తెలియజేసినా వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కార్పొరేషన్‌ డిప్యూటీ కమిషనర్‌ బిక్కిరెడ్డి శివారెడ్డి, డీఈలు కృష్ణారెడ్డి, రెహమాన్‌, ఏఈలు ప్రవీణ్‌, కిషోర్‌, వైఎస్సార్‌ సీపీ పట్టణ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాలస్వామిరెడ్డి, తాడేపల్లి పట్టణ జేసీఎస్‌ కన్వీనర్‌ ఈదులమూడి డేవిడ్‌రాజు, ఎస్టీ సెల్‌ జిల్లా కార్యదర్శి చిన్నబోతుల దుర్గారావు, బీసీ, ఎస్సీ, ఎస్టీ తాడేపల్లి పట్టణ కన్వీనర్లు బాలసాని అనీల్‌, ముదిగొండ ప్రకాష్‌, బత్తుల దాసు, వలంటీర్లు, సచివాలయ ఇంజినీరింగ్‌ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు అన్నదానం

మంగళగిరి: నగరంలోని ఎస్సీ, ఎస్టీ రైట్స్‌ అండ్‌ యాక్ట్స్‌ రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం దివ్యాంగులకు, పేదలకు డాక్టర్‌ బీఆర్‌ అంబేద్కర్‌ ఆర్మీ ట్రస్ట్‌ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ట్రస్ట్‌ సెక్రటరీ గరికముక్కు డేవిడ్‌ మాట్లాడుతూ తన కుమారుడు జాన్సన్‌ పుట్టిన రోజు సందర్భంగా దివ్యాంగులు, పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ రైట్స్‌ అండ్‌ యాక్ట్స్‌ రాష్ట్ర కార్యదర్శి కారుమంచి రామారావు, సీపీఐ నాయకులు గంజి వెంకయ్య, అంబేద్కర్‌ ఆర్మీ ట్రస్ట్‌ సభ్యులు బూసి గోవిందరాజు, బీసీ నాయకులు గొర్రె నాగేశ్వరరావు, దళితనాయకులు బియ్యపు యాకోబు, పాస్టర్‌ మెషేక్‌, శేఖర్‌, కోటి తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలి

ఈఆర్‌ఓ లలిత కుమారి



మంగళగిరి: కార్పొరేషన్‌ పరిధిలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలని ఎలక్టోరల్‌ రిజిస్ట్రేషన్‌ అధికారి (ఈఆర్‌ఓ) లలిత కుమారి సూచించారు. నగరంలోని కొత్తపేటలో ఓటర్ల నివాసం ఉండే డోర్‌ నెంబర్లలో తప్పులను ఏఈఆర్‌ఓ, నగరపాలక సంస్థ అడిషనల్‌ కమిషనర్‌ హేమమాలినితో కలసి పరిశీలించారు. ఈఆర్‌ఓ లలితకుమారి మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు నమోదు చేసుకోవాలని, ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటు ఒక వజ్రాయుధం వంటిదన్నారు. ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నప్పుడే ప్రజాస్వామ్య వ్యవస్థ బలపడుతుందన్నారు. ఓటర్లు తమ వివరాలను నమోదు చేసుకునేందుకుగానూ ఓటర్‌ హెల్ప్‌లైన్‌ యాప్‌ను రూపొందించినట్లు తెలిపారు. ఈ యాప్‌ ద్వారా ఓటర్‌ సేవలు, సదుపాయాలు ప్రజలకు అందుబాటులో ఉంటాయన్నారు.

రోటరీ క్లబ్‌ ఆధ్వర్యంలో విద్యార్థులకు బస్‌పాస్‌లు అందజేత



బస్‌పాస్‌లు అందుకున్న డాన్‌బాస్కో విద్యార్థులతో రోటరీ క్లబ్‌ ఆఫ్‌ మంగళగిరి ప్రతినిధులు

మంగళగిరి: యర్రబాలెంలోని డాన్‌బాస్కో ఉన్నత పాఠశాల విద్యార్థులకు రోటరీ క్లబ్‌ ఆఫ్‌ మంగళగిరి ఆధ్వర్యంలో మంగళవారం ఉచితంగా బస్‌పాస్‌లు పంపిణీ చేశారు. రోటరీ జిల్లా 3150 గవర్నర్‌ బూసిరెడ్డి శంకరరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు బస్‌ పాస్‌లు అందజేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ డాన్‌బాస్కో ఉన్నత పాఠశాలకు వివిధ గ్రామాల నుంచి వచ్చే 260 మంది విద్యార్థులకు రోటరీ క్లబ్‌ ఆఫ్‌ మంగళగిరి ఆధ్వర్యంలో ఉచితంగా బస్‌పాస్‌లు అందజేయడం అభినందనీయమని కొనియాడారు. డాన్‌బాస్కో హెచ్‌ఎం ఫాతిమా మాట్లాడుతూ గతంలో తమ ఉన్నత పాఠశాల కేవలం వికలాంగ బాలబాలికల కోసమే స్థాపించడం జరిగిందని, అధిక శాతం పోలియోతో బాధపడే పిల్లలే ఉండేవారన్నారు. నాలుగు దశాబ్దాలుగా రోటరీ వారు నిర్వహించిన పోలియో నిర్మూలన కార్యక్రమాల వల్ల నేడు ఒక్క పోలియో విద్యార్థి కూడా లేరన్నారు. రోటరీ క్లబ్‌ ఆఫ్‌ మంగళగిరి అధ్యక్షులు అందె రేవంత్‌ మాట్లాడుతూ మంగళగిరి ప్రాంతంలోని మరి కొందరు విద్యార్థులకు కూడా ఏపీఎస్‌ఆర్టీసీ వారి బస్‌పాస్‌లను ఉచితంగా అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్‌ ఆఫ్‌ మంగళగిరి కార్యదర్శి గాజుల శ్రీనివాసరావు, కోశాధికారి నూతలపాటి వెంకటేశ్వరరావు, ప్రాజెక్ట్‌ చైర్మన్‌ డాక్టర్‌ వంశీకృష్ణ, పూర్వ అధ్యక్షులు డాక్టర్‌ అనిల్‌ చక్రవర్తి, డైరెక్టర్లు అందె మురళీమోహనరావు, కాపరౌతు సుందరయ్య, పారేపల్లి నిరంజన్‌ గుప్తా, మాజేటి వంశీకృష్ణ, బట్టు వెంకటేశ్వరరావు, తుళ్లిమిల్లి రామకృష్ణ, కొతరపు వేణుగోపాల్‌ తదితరులు పాల్గొన్నారు.

ఇష్టంతో కష్టపడి పనిచేస్తే విజయం దరిచేరుతుంది

మాజీ క్రికెటర్‌ అంబటి రాయుడు



సభలో మాట్లాడుతున్న మాజీ క్రికెటర్‌ అంబటి రాయుడు

మేడికొండూరు: ఏరంగంలోనైనా లక్ష్యం దిశగా ఎంత కష్టమైనపని అయినా ఇష్టంతో చేస్తే విజయం దరిచేరుతుందని మాజీ క్రికెటర్‌ అంబటి తిరుపతి రాయుడు అన్నారు. మండలంలోని మేడికొండూరు, డోకిపర్రు గ్రామాల్లో అంబటి రాయుడు మంగళవారం పర్యటించారు. తొలుత మేడికొండూరు జిల్లా పరిషత్‌ హైస్కూల్లో విద్యార్థులతో మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు సమృద్ధిగా అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం హైస్కూల్‌ క్రీడా మైదానంలో కొద్దిసేపు విద్యార్థులతో క్రికెట్‌ ఆడారు. అనంతరం డోకిపర్రు గ్రామంలోని ఎంపీయూపీ స్కూలును సందర్శించారు. పలువురు రైతులతో మాట్లాడి వారి పరిస్థితులను తెలుసుకున్నారు. డోకిపర్రు సమీపంలోని యూనివర్సల్‌ ఇంజినీరింగ్‌ కళాశాలలో ఇంజినీరింగ్‌ విద్యార్థులతో కొద్దిసేపు క్రి కెట్‌ ఆడి ఉత్సాహపర్చాడు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ మానవ జీవితంలో విద్యార్థి దశ క్రియాశీలకమని గుర్తుచేశారు. విద్యార్థి దశలో సమయం వృథాచేయకుండా సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. విద్యారంగంతోపాటు తమకు ఇష్టమైన క్రీడలో కూడా రాణించాలని అన్నారు. తల్లిదండ్రులు మనపైన పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఒక సముచిత స్థానంలో నిలిచేదాక ముందుకు సాగాలని అన్నారు. ప్రతి విద్యార్థి చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని అన్నారు. ప్రతి విద్యార్థి ఇతరులకు ఆదర్శవంతమైన విధానంలో ముందుకు సాగాలని అన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు కందుల సిద్దయ్య, వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ బాజి, ఉడతా శంకర్‌, షేక్‌ గాలిబ్‌, డోకిపర్రు గ్రామ సర్పంచ్‌ కొండెపోగు సామ్రాజ్యం, షేక్‌ ఆరీఫ్‌, ఉడతా ప్రభాకర్‌, కొండెపోగు ఎలీషా బాబు, యూనివర్సల్‌ ఇంజినీరింగ్‌ కళాశాల కరస్పాండెంట్‌ అండ్‌ సెక్రటరీ ఫాదర్‌ ఎం. ఫాతిమా మర్రెడ్డి, అసిస్టెంట్‌ డైరెక్టర్‌ రెవరెండ్‌ ఫాదర్‌ సీహెచ్‌ కిషోర్‌బాబు, ప్రిన్సిపల్‌ డాక్టర్‌ సీహెచ్‌ కేశవరెడ్డి, డిప్లమా విభాగపు ప్రిన్సిపల్‌ ఎం.జయరామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అంతర పంటలసాగు తప్పనిసరి



పంటను పరిశీలిస్తున్న జిల్లా అధికారులు

ఫిరంగిపురం: ప్రధాన పంటలతోపాటు అంతర పంటలసాగు తప్పనిసరిగా వేయాలని రాష్ట్ర రైతు సాధికారత సంస్థ జిల్లా డీపీఎం రాజకుమారి అన్నారు. మండలంలోని అమీనాబాద్‌ గ్రామంలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న ఆచార్య వెంకట్రామయ్య ప్రకృతి యోగాసంజీవని ఆరోగ్యసదనం వారి ఆశ్రమంలో ఏటీఎం మోడల్స్‌ బెడ్స్‌ ఏర్పాటు చేస్తున్నారు. వాటిని మంగళవారం డీపీఎం రాజకుమారి, ఎస్‌ఆర్పీ వెంకట్రావు నాయుడులు పరిశీలించారు. వెంకట్రావు నాయుడు మాట్లాడుతూ రైతులందరూ తక్కువ పెట్టుబడితో రసాయనాలు వాడకుండా ఏటీఎం మోడల్స్‌లో భాగంగా ప్రధాన పంటతోపాటు అంతర పంటలసాగు వేసుకోవాలని సూచించారు. అంతరపంటలుగా ముల్లంగి, బీట్రూట్‌, కేరట్‌, గోరు చిక్కుడు, చిక్కుడు, బీన్స్‌, అలచందలు, మొక్కజొన్న, ఆకుకూరలు పండించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సత్యసాయి జిల్లా మెంటార్‌ భార్గవ్‌, ఇ.వెంకటేశ్వర్లు, సీహెచ్‌ రాఘవేంద్ర, రైతులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయానికి ప్రాధాన్యమివ్వాలి

- జెడ్పీ చైర్‌పర్సన్‌ కత్తెర హెనీ క్రిస్టినా, సమన్వయకర్త సురేష్‌ కుమార్‌
- ఎస్సీ కార్పొరేషన్‌ ఆధ్వర్యంలో రైతులకు ఉచితంగా విత్తనాలు పంపిణీ



విత్తనాలు పంపిణీ చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్‌ కత్తెర హెనీక్రిస్టినా, సురేష్‌కుమార్‌

తాడికొండ: ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ప్రకృతి వ్యవసాయానికి ప్రాధాన్యతనివ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందని జిల్లా పరిషత్‌ చైర్‌పర్సన్‌ కత్తెర హెనీక్రిస్టినా, వైఎస్సార్‌ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్‌ కుమార్‌ అన్నారు. మంగళవారం తాడికొండ మండల పరిషత్‌ కార్యాలయంలో ఎస్సీ కార్పొరేషన్‌ ఆధ్వర్యంలో పీఎం అజయ్‌ పథకం కింద ఎస్సీ రైతులకు ఉచితంగా విత్తనాల పంపిణీ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. ప్రజారోగ్యం దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయానికి అధిక ప్రాధాన్యతనిస్తుందని, మరుగున పడిన ప్రకృతి వ్యవసాయాన్ని వెలుగులోకి తీసుకొచ్చేందుకు సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని కొనియాడారు. ప్రస్తుతం వ్యవసాయంలో పురుగుమందులు వాడకం పెరగడంతో పంట దిగుబడులు పెరిగినా ప్రజలకు రోగాలు తప్పడం లేదన్నారు. మాదిగ కార్పొరేషన్‌ చైర్మన్‌ కొమ్మూరి కనకారావు, రెల్లి కార్పొరేషన్‌ చైర్మన్‌లు కొమ్మూరి కనకారావు, మధుసూదనరావులు మాట్లాడుతూ మిర్చి పంటలో అధిక పురుగుమందుల వాడకం పెరిగిన కారణంగా కారం ద్వారా హానికారక రోగాలు ప్రజల వద్దకు దరిచేరుతున్నాయన్నారు. ప్రజల్లో రోగ నిరోధకశక్తిని పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇందుకోసం ప్రభుత్వం నూరుశాతం రాయితీపై ఎరువులు, పురుగుమందులు, విత్తనాలను అందజేసి ప్రోత్సహిస్తుందన్నారు. అనంతరం అతిథులతో కలిసి జెడ్పీ చైర్‌పర్సన్‌ దంపతులు ఎస్సీ రైతులకు విత్తనాల కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మార్కెట్‌ యార్డు చైర్మన్‌ చిమటా పూర్ణచంద్రరావు, ఎస్సీ కార్పొరేషన్‌ ఈడీ తేళ్ల ప్రేమకుమారి, ప్రకృతి వ్యవసాయ విభాగం డీపీఎం ఎ రాజకుమారి, వైస్‌ ఎంపీపీ రెడ్డి త్రివేణి, ఉప సర్పంచ్‌ ఉయ్యూరు వెంకటరెడ్డి, నిడుముక్కల, కంతేరు సర్పంచ్‌లు మాదాసు రత్నకుమారి, బెజ్జం మహేష్‌బాబు, ఎంపీడీవో అత్తోట దీప్తి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు మెరుగైన సేవలందించాలి

- వైఎస్సార్‌ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్‌
- నెక్కల్లు కో ఆపరేటివ్‌ సొసైటీ పాలకవర్గం ప్రమాణ స్వీకారం



చైర్మన్‌ మున్నంగి కోటిరెడ్డికి నియామకపత్రం అందజేస్తున్న కత్తెర సురేష్‌కుమార్‌

పెదపరిమి(తాడికొండ): కో ఆపరేటివ్‌ సొసైటీల ద్వారా రైతులకు మెరుగైన సేవలందించేందుకు నూతన చైర్మన్‌లు కృషిచేయాలని వైఎస్సార్‌ సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్‌ అన్నారు. తుళ్లూరు మండలం నెక్కల్లు కో ఆపరేటివ్‌ సొసైటీ చైర్మన్‌గా మున్నంగి కోటిరెడ్డి ప్రమాణ స్వీకార మహోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ పదవి బాధ్యతలను పెంచుతుందని, బాధ్యతాయుతంగా పనిచేసి రైతులకు మెరుగైన సేవలందించి సొసైటీ అభివృద్ధికి పాటుపడాలని సూచించారు. వ్యవసాయం అంటే మక్కువతో దివంగత సీఎం వైఎస్‌ రాజశేఖరరెడ్డి రైతు ప్రయోజనాలకు పెద్దపీట వేశాడని, నేడు సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌ రెడ్డి మరో రెండడుగులు ముందుకేసి రైతు భరోసా కేంద్రాలు, కో ఆపరేటివ్‌ సొసైటీలను బలోపేతం చేసి రైతుల చెంతకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారన్నారు. కులం, మతం, ప్రాంతం, పార్టీలకతీతంగా రైతులకు సేవలందిస్తున్న సీఎం వైఎస్‌ జగన్‌ మోహన్‌రెడ్డికి అన్నదాతల్లో ఆదరణ మరింత పెరిగిందన్నారు. నెక్కల్లు సొసైటీ ద్వారా రూ.50 కోట్లు వ్యాపారం జరిగిందని, అది ఇంకా అభివృద్ధి చేసి రూ.100 కోట్లుకు చేరాలని సూచించారు. అనంతరం నూతన చైర్మన్‌ మున్నంగి కోటిరెడ్డికి నియామకపత్రం అందజేశారు. పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సోదరులు బాబురావు, రఘునాధరావు, సొసైటీ డైరెక్టర్లు బుర్రా వెంకటరెడ్డి, అట్లూరి శ్రీనివాసరెడ్డి, నాయకులు ఎ.లక్ష్మీనారాయణరెడ్డి, అక్కల శ్రీనివాసరెడ్డి, కొప్పుల శేషగిరిరావు, బుర్రా వెంకటశివారెడ్డి, ఎస్‌.సందీప్‌ పాల్గొన్నారు.

మత్తు పదార్థాలను నియంత్రించాలి

ఐద్వా నేతల డిమాండ్‌

తాడేపల్లిరూరల్‌: మద్యం, మత్తు పదార్థాలను నియంత్రించాలని నిపుణులతో కమిషన్‌ ఏర్పాటు చేయాలని ఐద్వా నేతలు డిమాండ్‌ చేశారు. హింసపై మహిళల పోరుయాత్రలో భాగంగా మంగళవారం తాడేపల్లి ముగ్గురోడ్డుకు చేరుకున్న సందర్భంగా ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి మాట్లాడుతూ మహిళలపై, చిన్నారులపై హింస రోజురోజుకూ పెరుగుతోందని, నిరోధించాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్య ధోరణితో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళా రెజ్లర్లపై ఢిల్లీలో జరిగిన సంఘటన మరవక ముందే మణిపూర్‌లో కుకి తెగకు చెందిన గిరిజన మహిళలను నగ్నంగా ఊరేగించడం సిగ్గుచేటన్నారు. మహిళలపై జరుగుతున్న నేరాల అధ్యయనానికి నిపుణులతో కమిటీ ఏర్పాటుచేయాలని డిమాండ్‌ చేశారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.శ్రీనివాసకుమారి, జిల్లా అధ్యక్షులు కె.పద్మ, పట్టణ అధ్యక్షురాలు డి. విజయలక్ష్మి, జిల్లా కార్యదర్శి అరుణ ఉన్నారు.